సాక్షి
కామారెడ్డి
గురువారం । 22 । ఆగస్టు । 2024



వృద్ధులను ఇబ్బంది పెడితే..

వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరుతూ రామేశ్వర్‌పల్లి వృద్ధ సంఘం తీర్మానించింది.

- 8లో ▸



నిలిచిన నీటి సరఫరా

సింగూర్ వద్ద మోటార్లు కాలిపోవడంతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.4 /23.1

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సీఎంతో షబ్బీర్ అలీ సమావేశం



కామారెడ్డి టౌన్: రాష్ట్ర సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కలిశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమంపై చర్చించారు. జిల్లా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు షబ్బీర్ అలీ తెలిపారు.

నిజాంసాగర్‌లోకి 1,230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,230 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,391.11 అడుగులు (4.526 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

'స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి'

కామారెడ్డి టౌన్: జిల్లాలోని అర్హులైన దివ్యాంగ విద్యార్థులు జాతీయ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి బావయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల సాధికారత విభాగం ద్వారా 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్, ఇంటర్ నుంచి పీజీ వరకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ లేదా డిప్లొమా కోసం టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలలో చదువుతున్న దివ్యాంగులు www.depwd.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఈనెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్‌లకోసం అక్టోబర్ 31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకోసం సమీకృత కలెక్టరేట్ భవనంలోని రూమ్ నంబర్ 31లోగల జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


రక్షణ కమిటీ ఏర్పాటు చేయాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. బుధవారం జీజీహెచ్‌లో న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోల్‌కతాలో హత్యాచారానికి గురైన వైద్యురాలి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్, ఆర్ఎంవో యాదగిరి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడపై బీఆర్ఎస్ నజర్

- పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు వ్యూహాలు
- బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఇన్‌చార్జీగా నియమించే అవకాశాలు
- నేడు బాన్సువాడలో రుణమాఫీ ఆందోళనలో పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యే
- గులాబీ దళంలో నూతనోత్సాహం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బాన్సువాడ నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరడంతో.. ఆయనను ఢీకొట్టే గట్టి నేత కోసం గులాబీ దళం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో బాన్సువాడ నియోజకవర్గంలో గులాబీ దళానికి గట్టి దెబ్బ తగిలింది. ఆయనకు ఐదేళ్ల మంత్రిగా, మరో ఐదేళ్ల స్పీకర్‌గా అవకాశం ఇచ్చి గౌరవిస్తే.. పార్టీకి ద్రోహం చేసి వెళ్లారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీని వీడడాన్ని బీఆర్ఎస్ నాయకత్వం సీరియస్‌గానే తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాన్సువాడ నియోజకవర్గం నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ నాయకత్వంలో బీఆర్ఎస్ నేతలు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాన్సువాడ క్యాడర్‌కు తామంతా అండగా ఉంటామని, త్వరలోనే అక్కడ సమావేశం పెడతామని ఆయన చెప్పారు. అంతకుముందు కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధేలు సమావేశమై పోచారం పార్టీని వీడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోచారం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి నేతలతో కలిసి బాజిరెడ్డి సమావేశం అయిన నేపథ్యంలో ఆయనను బాన్సువాడ నియోజకవర్గానికి పార్టీ పంపిస్తుందన్న ప్రచారం ఊపందుకుంది. తెలంగాణ భవనలో బాజిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడిన సందర్భంగా పోచారం రాజీనామా చేసి, తిరిగి ఎన్నికల్లో నిలబడాలని, తాను వచ్చి పోటీ చేస్తానని సవాల్ చేశారు. తాజాగా రైతు రుణ మాఫీ సమస్యపై బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఆందోళనలకు పిలుపునిచ్చింది. బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రైతు ధర్నాలో బాజిరెడ్డి పాల్గొంటారని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో పోచారం రాజీనామాతో నిస్తేజంలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

మారనున్న సమీకరణాలు..

బాన్సువాడ నియోజకవర్గంలో వరుస విజయాలు సొంతం చేసుకుని ఉమ్మడి రాష్ట్రంలో కీలకమైన శాఖలకు మంత్రిగా పనిచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని 2004 లో బాజిరెడ్డి ఓడించి సంచలనం సృష్టించారు. దివంగత సీఎం వైఎస్సార్ సూచనల మేరకు బాన్సువాడకు వెళ్లి పోటీ చేసి విజయం సాధించిన బాజిరెడ్డి గోవర్ధన్.. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్న పేరుంది. దీంతో ఆయనకు నియోజకవర్గవ్యాప్తంగా అభిమానులు తయారయ్యారు. అయితే 2009 ఎన్నికల్లో బాజిరెడ్డి ఓటమి చెందారు. బాజిరెడ్డి ఓడినా నియోజకవర్గంలో ఇప్పటికీ ఆయనకు ముఖ్య అనుచరులు ఎందరో ఉన్నారు. తర్వాత కొంత కాలానికి బీఆర్ఎస్‌లో చేరిన బాజిరెడ్డి గోవర్ధన్.. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2023 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఢీకొట్టే నేత కోసం అన్వేషిస్తున్న బీఆర్ఎస్.. బాజిరెడ్డిని అక్కడికి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. బాన్సువాడపై బాజిరెడ్డి దృష్టి సారిస్తే రాజకీయ సమీకరణాలు మారుతాయని భావిస్తున్నారు. నియోజకవర్గంలో పోచారంను వ్యతిరేకించే నేతలంతా బాజిరెడ్డి వెంట నడిచే అవకాశాలున్నాయి.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు, రైతులు

- అన్నదాతల డిమాండ్
- కామారెడ్డిలో బీకేఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

కామారెడ్డి క్రైం: ఆంక్షలు లేకుండా పంట రుణాలను మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ తీశారు. సీఎస్ఐ చర్చి ప్రాంతంనుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రోడ్ల మీదుగా సాగి కలెక్టరేట్ వరకు చేరుకుంది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు మాట్లాడుతూ బ్యాంకులు రేషన్ కార్డు చూసి రుణాలు ఇవ్వలేదని, పట్టాదారు పాస్‌బుక్‌ల ఆధారంగానే పంట రుణాలు ఇచ్చారని పేర్కొన్నారు. "మీరు రుణాలు తీసుకోండి.. మేం అధికారంలోకి వచ్చాక మాఫీ చేస్తాం" అని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మూడు విడతల్లో కలిపి 50 శాతం రైతులకు కూడా రుణ మాఫీ కాలేదని పేర్కొన్నారు. రూ. 2 లక్షలలోపు పంట రుణాలు పొందిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు లేకుండా ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేంత వరకు పార్టీలకు అతీతంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు లొంక వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, ప్రతినిధులు ఆనంద్‌రావు, నగేష్, లక్ష్మారెడ్డి, అంజన్న, కపిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

రైతుల ఆందోళన నేపథ్యంలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ బయటకు వచ్చి తమ సమస్యను వినాలని రైతులు డిమాండ్ చేయగా.. డీఎస్పీ వారిని సముదాయించారు. పది మంది రైతు ప్రతినిధులను కలెక్టరేట్ లోనికి అనుమతించారు. రైతు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

రాష్ట్ర స్థాయి సమావేశాల్లో జిల్లా నేతలు

కామారెడ్డి టౌన్: సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశాలలో జిల్లాకు చెందిన నేతలు పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితోపాటు పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, రాము, కామారెడ్డి బల్దియాలో పార్టీ ఫ్లోర్‌లీడర్ మోటూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే కేవీఆర్‌తో బీజేపీ జిల్లా నాయకులు

రుణమాఫీ కోసం బీఆర్ఎస్ పోరుబాట

- నేడు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలన్న డిమాండ్‌తో బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ధర్నా చేపట్టాలని నిర్ణయించింది. ఈ విషయమై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో ఆందోళనలకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్ పాల్గొననున్నారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలో జరిగే ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ నియోజకవర్గంలో జరిగే ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే ధర్నాలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొననున్నారు. అన్ని మండలాల్లోనూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేయనున్నాయి. పంట రుణాల మాఫీ అంశాన్ని ఎజెండాగా తీసుకుని చేపట్టిన ఆందోళనలకు రైతులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

లోన్ ఎందుకు మాఫీ కాలేదంటే..

- ఆధార్, రుణ ఖాతాలలో పేరు వేరువేరుగా ఉండడం..
- కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగకపోవడం..
- పట్టాదారు పాస్‌బుక్ లేకపోవడం..
- పోర్టల్‌లో చెక్ చేసి వివరాలు చెబుతున్న వ్యవసాయ అధికారులు



నాగిరెడ్డిపేటలో వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పంట రుణాలు మాఫీ కాని రైతులు అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయ అధికారులు వివరాలను ఆన్‌లైన్‌లో చెక్ చేసి.. లోన్ ఎందుకు మాఫీ కాలేదో చెబుతున్నారు. ఆధార్, రుణ ఖాతాలలో పేరు వేరుగా ఉండడం, కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగకపోవడం, పట్టాపాస్‌బుక్, డాటా లేకపోవడం తదితర కారణాలతో రుణాలు మాఫీ కాలేదని తెలుస్తోంది.

జిల్లాలో 1.70 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. మూడు విడతల్లో కలిపి 91,899 మందికి సంబంధించిన రూ.655.37 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. రుణమాఫీ కాని వారి నుంచి వివరాలు సేకరించడంకోసం ప్రభుత్వం అన్ని మండలాల్లో రైతు వేదికల వద్ద ఒక అధికారిని నియమించింది. జిల్లాలో 25 మండలాల్లో రైతు వేదికల వద్ద ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. వారు రైతుల సమస్యను అడిగి పోర్టల్‌లో చెక్ చేసి కారణాలు చెబుతున్నారు. ఆధార్ కార్డుల్లోని పేరు, రుణ ఖాతాలో ఉన్న పేరు వేరుగా ఉండడంతో ఎక్కువ మందికి రుణమాఫీ కాలేదని 'సాక్షి' పరిశీలనలో తేలింది. అలాగే కుటుంబ సభ్యుల నిర్ధారణ అన్న కాలం కూడా ఎక్కువగా కనిపిస్తోంది. మరి కొందరి డాటా లభించడం లేదు. వివిధ కారణాలతో మాఫీ అవకాశం కోల్పోయిన రైతులు తమ రుణం మాఫీ అవుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఇరుగు పొరుగు వారికి రుణం మాఫీ అయి తమకు కాకపోవడంతో మనోవేదనకు గురవుతున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

గ్రీవెన్స్‌కు 7,087 ఫిర్యాదులు...

జిల్లాలో రుణమాఫీ ప్రక్రియ మొదలైన నుంచి బుధవారం సాయంత్రం వరకు 7,087 ఫిర్యాదులు నమోదయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతుల ఆధార్ నంబర్ ద్వారా పోర్టల్‌లో చెక్ చేసి వివరాలు చెబుతున్నారన్నారు. పోర్టల్‌లో చెక్ చేసిన వాటిలో 2,287 మంది రైతులకు ఆధార్‌లో పేరు, రుణఖాతాలో ఉన్న పేరు వేరుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే 1,458 మందికి సంబంధించి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. 1,329 మంది రైతులకు సంబంధించి ఎలాంటి డాటా లేదని, పాస్‌బుక్ లేక, మంజూరైన రుణంకన్నా వడ్డీ ఎక్కువగా ఉండడం తదితర కారణాలతో మరికొందరి రుణాలు మాఫీ కాలేదని తెలిపారు.

లోన్ మాఫీ కాలేదు



నాకు, నా భార్యకు కలిపి రూ. 2 లక్షలలోపు పంట రుణం ఉంది. కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామన్నారు. మాకెందుకు మాఫీ కాలేదో అర్థం అయితలేదు. మాకు న్యాయం చేయాలి.
–జైతురాం, సోమార్‌గడి తండా, ఎల్లారెడ్డి మండలం

పేరులో తేడా ఉందంటున్నరు



నాకు క్రాప్ లోన్ మాఫీ కాలేదు. అధికారులను అడిగితే ఆధార్ కార్డులో పేరు, లోన్ ఖాతాలో పేరు మ్యాచ్ కావడం లేదని చెబుతున్నారు. అప్పుడు ఎట్లా రాసింర్రో తెలియదు. అధికారులు సవరించి, లోన్ మాఫీ చేయాలి. – మెత్తల సురేందర్, రాజంపేట

ఏజెంట్లను నియమించుకోవాలి

కామారెడ్డి క్రైం: రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో ప్రముఖుల పేర్లు గల్లంతుకాకుండా చూడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీల ప్రతినిధులపై కూడా ఉందన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండినవారు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు ఇందిరా ప్రియదర్శిని, అనిల్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఖాసీం, వెంకట్ గౌడ్, మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణపై మండల, మున్సిపల్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వే నంబర్లు, ప్లాట్, దరఖాస్తు సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి, దేవాదాయ శాఖ భూమి లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందుగా దరఖాస్తుదారులకు సమాచారం అందించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సమావేశంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పక్షం రోజుల్లో నిర్మాణం పూర్తి చేయాలి



రామారెడ్డి: గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం రామారెడ్డి శివారులోని గంగమ్మ వాగు వంతెన పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, డీఈ జాలిగామ శ్రీనివాస్, ఏఈ రవితేజలకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం రామారెడ్డిలోని కేజీబీవీని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఇసన్నపల్లి పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి, మొక్కల పెరుగుదలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఆర్డీవో సురేందర్, అడిషనల్ పీడీ వామన్‌రావు, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సువర్ణ, ఏపీవో ధర్మారెడ్డి, కార్యదర్శులు క్రాంతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడి సేవలో...

ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని శ్రీ కాలభైరవ ఆలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాముఖ్యతను వేద పండితులు వివరించారు. ఆలయ ఉద్యోగులు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రభు, ఉద్యోగులు శ్రీనివాస శర్మ, రాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెదక్-రుద్రూర్ హైవే పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి: మెదక్- రుద్రూర్ హైవే పనులు ఎల్లారెడ్డిలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఎల్లారెడ్డి శివారులోని సోమార్‌పేట్ బైపాస్ రోడ్డు నుంచి హైవే అథారిటీ అధికారులు రోడ్డు పనులను ప్రారంభించారు.

చర్చావేదిక బ్రోచర్ ఆవిష్కరణ



దోమకొండ: గడికోటలో ఈనెల 24న తెలంగాణ చరిత్ర, వారసత్వం అంశంపై చర్చావేదిక నిర్వహించనున్నారు. తెయూ సౌత్ క్యాంపస్, దోమకొండ గడికోట సంయుక్తంగా నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం దోమకొండలో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధన విద్యార్థులు, జిల్లాలోని వివిధ విభాగాల్లో చరిత్ర విభాగానికి సంబంధించిన అధ్యాపకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోషల్ సైన్స్ డీన్ గంటా చంద్రశేఖర్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, కో-డైరెక్టర్ అంజయ్య పాల్గొన్నారు.

వృద్ధులను ఇబ్బంది పెడితే ఊరుకోం



భిక్కనూరు: వృద్ధులను ఇబ్బంది పెడితే ఊరుకోమని, తల్లిదండ్రులకు తిండిపెట్టని కుమారుల ఇంటి ముందర ధర్నా చేస్తామని రామేశ్వర్‌పల్లి గ్రామ శివసాయిరెడ్డి వృద్ధుల సంఘం సభ్యులు తీర్మానం చేశారు. బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గ్రామంలోని వృద్ధ సంఘ భవనంలో గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రాజిరెడ్డి, అధ్యక్షుడు తక్కళ్ల రాజిరెడ్డి అధ్యక్షతన సమావేశమయ్యారు. కేకు కోసి ప్రజలకు పంచిపెట్టారు. వృద్ధులకు ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని తీర్మానించి ఈ తీర్మానం ప్రతిని సీఎం, పీఎంలకు పంపించారు. సంఘం ఉపాధ్యక్షుడు సందుగారి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నీటి సరఫరా

- సింగూర్ వద్ద కాలిపోయిన మోటార్లు
- మరమ్మతులు చేపట్టిన అధికారులు
- గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం
- పునరుద్ధరణపై స్పష్టతనివ్వని అధికారులు



సింగూర్ ప్రాజెక్టు వద్ద కాలిపోయిన మోటార్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లాలోని పలు మండలాలకు మిషన్ భగీరథ ద్వారా అందించే నీటి సరఫరా రెండు రోజులుగా నిలిచిపోయింది. సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన పంపుహౌజ్‌లోని మోటార్లు కాలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం సాయంత్రం నుంచి జిల్లాకు నీటిసరఫరా నిలిచిపోయింది. దీంతో జిల్లాలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. పంప్‌హౌజ్ వద్ద మోటార్లు బాగయ్యే వరకు నీటి సరఫరా పునరుద్ధరించలేమని మిషన్ భగీరథ అధికారులు పేర్కొంటున్నారు. అప్పటివరకు గ్రామాల్లోని బోర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని అందించాలని జీపీ సిబ్బందికి మౌఖికంగా తెలియజేశారు. దీంతో బుధవారం గ్రామ పంచాయతీలలో స్థానికంగా ఉన్న బోర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని అందజేశారు. మోటార్లకు మరమ్మతులు ఎప్పుడు పూర్తవుతాయో, మిషన్ భగీరథ నీటి సరఫరా ఎప్పుడు తిరిగి ప్రారంభిస్తారనే విషయంపై సంబంధిత అధికారులు స్పష్టతనివ్వలేకపోతున్నారు.

అంతరాయం నిజమే

సింగూర్ ప్రాజెక్టు నుంచి జిల్లాకు నీటిని సరఫరా చేసే మోటార్లు కాలిపోవడం వల్ల మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన మాట వాస్తవమే. అక్కడున్న అధికారులు మోటార్లకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. అప్పటి వరకు గ్రామాల్లోని బోర్ల ద్వారా తాగునీటిని అందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించాం.

– విష్ణు, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ, ఎల్లారెడ్డి

చావుతో పోరాడుతున్న ఉద్యమ నేత

- కిడ్నీ, లివర్ చెడిపోవడంతో ఆస్పత్రి పాలైన ప్రవీణ్‌గౌడ్
- ఆపన్న హస్తాల కోసం ఎదురుచూపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌గౌడ్

బాన్సువాడ: ఒకప్పుడు విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేసిన విద్యార్థి నేత నేడు చావుతో పోరాడుతున్నారు. కిడ్నీ, లివర్ చెడిపోయి ఆస్పత్రి పాలయ్యారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో ఆపన్న హస్తాల కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలు.. బాన్సువాడ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన గడ్డమీది ప్రవీణ్‌గౌడ్ బీసీ విద్యార్థి సంఘం నేతగా ప్రభుత్వ పాఠశాలల, విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేశారు. బీసీ విద్యార్థి సంఘంలో మండల, డివిజన్ స్థాయి నుంచి రాష్ట్ర ఉపాధ్యక్ష స్థాయికి ఎదిగారు. ఉద్యమాలు చేస్తున్న సమయంలో ప్రవీణ్‌గౌడ్‌కు గడ్డమీది ప్రవీణ్‌గౌడ్‌కు బదులుగా బీసీ ప్రవీణ్‌గౌడ్‌గా పేరు వచ్చింది. అలాంటి ఉద్యమ నేత నేడు అంపశయ్యపై బతుకుజీవుడా అంటూ పోరాటం చేస్తున్నారు. చికిత్సకు సొంత ఇంటిని సైతం అమ్మేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రవీణ్‌గౌడ్ పరిస్థితిని చూసి తాడ్కోల్ శివారులో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చారు. దీంతో ప్రవీణ్‌గౌడ్‌తో పాటు తన భార్య, పిల్లలు, అమ్మ డబుల్ బెడ్ రూంలో నివాసముంటున్నాడు. పదిహేను రోజులుగా ప్రవీణ్‌గౌడ్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో నిజామాబాద్‌లోని ప్రుడెన్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఆపరేషన్ కోసం చాలా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. దాతలు స్పందించి తమకు తోచినంత సాయం చేయాలని ప్రవీణ్‌గౌడ్ తల్లి సావిత్రి వేడుకుంటోంది. దాతలు స్పందించి ప్రవీణ్‌గౌడ్‌కు 9494490107కు (అవినాష్) ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా కానీ సాయం అందించాలని కోరుతున్నారు.

అన్నాభావు సాఠే అందరికి ఆదర్శం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



దన్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): అన్నా భావు సాఠే ప్రతి ఒక్కరికి ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు వ్యాఖ్యానించారు. మండలంలోని తడిహిప్పర్గా, దన్నూర్‌లో బుధవారం అన్నా భావు సాఠే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెండా ఎగురవేసి అన్నా చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అన్నా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కోరారు.

గ్రామాలను అభివృద్ధి చేస్తా

గుంతల రోడ్డున్న చిన్న ఎక్లార గ్రామానికి త్వరలో బీటీ రోడ్డు వేస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు హామీ ఇచ్చారు. చిన్న ఎక్లార గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రస్తుతం మొరం రోడ్డు పనులను ప్రారంభించి త్వరలో బీటీ రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడు సాయిలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి

నిజాంసాగర్(జుక్కల్): సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకులాల్లో విద్యార్థుల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు, సంక్షేమ వసతి గృహాల జిల్లా, డివిజన్ అధికారులు, వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.

మస్కట్‌లో చిక్కుకున్న జిల్లావాసి

- విదేశాంగ శాఖకు ఫిర్యాదు చేసిన బాధితుడి భార్య
- స్పందించిన కలెక్టర్, మస్కట్‌లోని ఇండియన్ ఎంబసీ

కామారెడ్డి క్రైం: మోసాలకు గురై ఒమన్ రాజధాని మస్కట్‌లో నానా అవస్థలు పడుతున్న ఓ గల్ఫ్ బాధితుడి దీన స్థితి బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన యెల్ది ప్రభాకర్ కొద్ది రోజుల క్రితం ఉపాధి కోసం అప్పులు చేసి మస్కట్‌కు వెళ్లారు. మస్కట్ బల్దియాలో రోడ్ క్లీనర్ ఉద్యోగం అని వాగ్దానం చేసిన ఇక్కడి ఏజెంట్, ప్రభాకర్ నుంచి రూ.60 వేలు తీసుకుని పంపాడు. మే 8న మస్కట్‌కు చేరుకున్న ప్రభాకర్‌కు అక్కడ ఎలాంటి దొరకలేదు. ఒక గదిలో విద్యుత్, నీటి సమస్యలతో కాలం వెళ్లదీస్తున్నాడు. గడిచిన మూడున్నర నెలలుగా పని, సరైన భోజనం, వసతి కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి సహకారం తీసుకున్నారు. ప్రభాకర్ భార్య అనసూయ హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ అధికారి(పీఐఈ)కి మంగళవారం ఫిర్యాదు చేశారు. ముంబయి నుంచి మస్కట్ చేరిన నాటి నుంచి ప్రభాకర్ ఇబ్బందులకు గురవుతున్నాడని, రిక్రూటింగ్ ఏజెన్సీపై, విదేశీ యజమానిపై తగిన చర్య తీసుకోవాలని, అక్కడ ప్రభాకర్‌కు సౌకర్యాలు, ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని అనసూయ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మదద్' హెల్ప్‌లైన్ వారు స్పందించి ఒమన్‌లోని ఇండియన్ ఎంబసీ ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు 'ఎక్స్'లో ట్వీట్ చేశారని మంద భీంరెడ్డి తెలిపారు. విషయం తెలియడంతో కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, రామారెడ్డి తహసీల్దార్, సిబ్బందిని మద్దికుంట గ్రామానికి పంపి గల్ఫ్ బాధితుడు ప్రభాకర్ భార్య అనసూయ నుంచి వివరాలు సేకరించారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ

బాన్సువాడ : ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగిన 35వ జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో బాన్సువాడకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని సన్‌షైన్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 8 మంది విద్యార్థులు రజత పతకాలు, 11 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. 4వ తరగతి చదువుతున్న షేక్ అరబ్ అనే విద్యార్థి కుంగ్‌ఫూ, కథ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ శంకర్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కాన్పులపై అవగాహన కల్పించాలి

భిక్కనూరు: ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని జిల్లా మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అనురాధ అన్నారు. బుధవారం ఆమె భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటే జరిగే మేలు గురించి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. వైద్యులు యేమిమా, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, స్టాఫ్ నర్సు హరిత ఉన్నారు.

పాఠశాల భవన మరమ్మతు పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రామక్కపల్లి ప్రాథమిక పాఠశాల భవన మరమ్మతు పనులను బుధవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులను ఆయన తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం పనులను నాణ్యతతో త్వరగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయనవెంట పాఠశాల హెచ్ఎం మౌనిక ఉన్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల నిరసన



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జనరల్ ఆస్పత్రిలో జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ.. సమ్మె నోటీస్ ఇచ్చి 15 రోజులు గడిచినా ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. చాలీచాలనీ వేతనాలు చెల్లిస్తున్నారని కనీస వేతనం రూ.27వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యమిత్రలు స్వామి రెడ్డి, సాయిబాబా, అంజయ్య, మహేష్, నిర్మల పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి మృతి

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్(50) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఎస్సై నారాయణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రజక వృత్తి చేసుకునే లక్ష్మణ్ కాలువలో బట్టలను ఉతుకుతుండగా ప్రమాదవశత్తు నీటిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తిరుపతి కొండ ఎక్కుతుండగా బోధన్‌వాసి..



బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తిరుపతిలో స్వామి వారి దర్శనం కోసం కొండ మెట్లు ఎక్కుతుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన స్వర్ణకారుల సంఘం పట్టణ అధ్యక్షుడు జనార్దన్‌చారి(52) భార్య, కుమార్తెతో కలిసి తిరుపతికి రెండు రోజుల క్రితం జిల్లా నుంచి బయలుదేరి వెళ్లారు. బుధవారం తిరుపతిలో స్వామి వారి దర్శనం కోసం కొండ మెట్లు ఎక్కుతుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. పలువురు ప్రముఖులు, స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు ప్రభాకర్ చారి, సుధాకర్ చారి ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

కారు-ఆటో ఢీకొని ఒకరికి గాయాలు



పిట్లం: మండలంలోని రాంపూర్ శివారులో కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మహిళకు గాయాలు కావడంతో ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం రాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..



ఎడపల్లి: టీవీఎస్ ఎక్సెల్, ఆటో ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం నాగనపల్లికి చెందిన భార్యాభర్తలు టీవీఎస్ ఎక్సెల్ పై బోధన్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా దూపల్లి గేట్ సమీపంలో రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో వీరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుట్కా స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని కుమార్‌గల్లీలో గుట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు చేశారు. ఈ దాడిలో రూ.1లక్ష52 వేల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు.

న్యావనందిలో పేకాట స్థావరంపై..

సిరికొండ: మండలంలోని న్యావనంది శివారులో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. పేకాట ఆడుతున్న 11 మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 31,500 నగదు, 11 సెల్ ఫోన్లు, 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుళ్లిపోయిన మృతదేహం లభ్యం

మద్నూర్(జుక్కల్): మండల సమీపంలోని జాతీయ రహదారి పక్కన కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల శివారులోని జాతీయ రహదారికి 50 గజాల దూరంలో ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి ఉన్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మృతదేహం ఒంటిపై నల్లని ప్యాంటు, గోధుమ రంగు షర్ట్ ఉందన్నారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. మృతదేహానికి బట్టతల ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712686177, 8712686175 నంబర్లను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



బస్వరాజ్

బోధన్‌రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని హున్సాలో చోటు చేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హున్సాకు చెందిన బస్వరాజ్(21) మద్యానికి బానిసై ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ ఢీకొన్న ఘటనలో..

నిజామాబాద్‌రూరల్: బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన నారాయణగౌడ్(63) మంగళవారం ముత్తకుంట వైపు తాటి చెట్లు గీయడానికి తన బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నారాయణను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నవీపేటలో మరొకరు..

నవీపేట: ట్రాక్టర్ కిందపడి తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఈరగొట్టు సాయిలు(52) క్రేజీవీల్ ట్రాక్టర్‌పై కూలీగా పనిచేస్తున్నాడు. 20 రోజుల క్రితం గ్రామంలో ట్రాక్టర్‌పై కూలీగా పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీమా డబ్బుల కోసం తల్లిని చంపిన కొడుకు



అంజవ్వ(ఫైల్)

నస్రుల్లాబాద్: తండ్రి బీమా డబ్బుల కోసం ఓ కొడుకు తల్లిని చంపిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై వెంకట్రావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన మెక్క అంజవ్వ(46) భర్త సాయిలు గతంలో మృతిచెందాడు. సాయిలు మృతితో బీమా డబ్బులు వచ్చాయి. అందులో కొంత డబ్బును కొడుకు సాయికుమార్‌కు మరి కొంత డబ్బును బ్యాంకులో జమ చేసింది. అయితే బ్యాంకులో ఉన్న డబ్బులు సైతం ఇవ్వాలంటూ సాయి కుమార్ తల్లితో గొడవ పడేవాడు. మంగళవారం సైతం వీరి మధ్య గొడవ జరిగింది. డబ్బులు ఇవ్వడం లేదనే కోపంతో సాయి కుమార్ తల్లిని విపరీతంగా కొట్టాడు. దెబ్బలకు తాళలేక అంజవ్వ మృతి చెందింది. కుమార్తె సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

లింగంపేటలో ప్రైవేట్ ఆస్పత్రి సీజ్

- అనుమతులు లేకుండా శస్త్ర చికిత్సలు
- డెంగీ కేసులకు వైద్యం అందించినందుకు..



ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

లింగంపేట: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకుమార్ బుధవారం సీజ్ చేశారు. మండలంలోని బాయంపల్లి కిషన్‌నాయక్ తండాకు చెందిన బీటెక్ విద్యార్థి సబావత్ చౌహాన్ వీరేందర్(22) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందిన విషయం విధితమే. సదరు విద్యార్థికి డెంగీ పరీక్షలు చేసి వైద్యం అందించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన వెల్లడించారు. ఈ విషయమై ఆయా దిన పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా జిల్లా వైద్యాధికారులు స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారులు తండాకు చేరుకొని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు తెలిపారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాహుల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో అనుమతి లేకుండా ఉన్న ఆపరేషన్ థియేటర్‌పై వైద్యుడిని ప్రశ్నించారు. సదరు ఎంబీబీఎస్ వైద్యుడు లేకుండానే అతని పేరిట ప్రైవేటు వైద్యుడు రాజు ఆపరేషన్లు చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. దీంతో ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఆస్పత్రిని సీజ్ చేసినట్లు ప్రభుకుమార్ తెలిపారు. ఆస్పత్రిని సీజ్ చేసిన విషయాన్ని జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్‌కు నివేదిక అందించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి హిమబిందు, డీఎంవో సిబ్బంది శ్రీనివాస్, శివయ్య, సూపర్‌వైజర్ ఫరీదాబేగం, సీహెచ్‌వో రమేశ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో బిహార్‌కు చెందిన రోహిత్‌కుమార్(22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోహిత్ బిహార్ నుంచి 12రోజుల క్రితం ఎర్రాపహాడ్‌కు చెందిన ఓ వ్యక్తి పశువుల షెడ్డులో పనికి చేరాడు. కాగా రోజువారీలాగే పని చేస్తున్న రోహిత్ బుధవారం సాయంత్రం షెడ్డు ప్రాంతంలో ఎవరూ లేని సమయంలో షెడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరు..

రామారెడ్డి: కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సింగరాయపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెడ్డు అనిల్(26) కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాలు, భార్యను ఆస్పత్రుల్లో చూయించేందుకు, గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు పెరిగిపోవడంతో ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సౌభాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఖిల్లా చౌరస్తాలో మంగళవారం రాత్రి గంజాయి తరలిస్తున్న పాత నేరస్తుడు షేక్ అస్లాంను పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ బుధవారం తెలిపారు. నిందితుడి నుంచి 260 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా మూడు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో మరొకరు..

జక్రాన్‌పల్లి: మండలంలోని వివేక్‌నగర్ తండాలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. బుధవారం జక్రాన్‌పల్లి పీఎస్‌లో నిందితుడి వివరాలు వెల్లడించారు. వివేక్‌నగర్ తండాకు చెందిన బానవత్ సురేష్ ఈ నెల 17న తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి దైవదర్శనం కోసం తిరుపతికి వెళ్లాడు. అదే రోజు సురేష్ వద్ద కూలీ పని చేసిన కోనేటి నరేశ్ అర్ధరాత్రి సురేష్ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. లక్ష నగదుతో పాటు రెండు తులాల బంగారు నెక్లెస్, తులం జత బంగారు బుట్టలు, నాలుగున్నర గ్రాముల ఉంగరం, ఇరవై తులాల పట్టగొలుసులు దొంగిలించినట్లు పేర్కొన్నారు. సురేష్ తండ్రి బానవత్ జీలా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగిలించిన నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసును త్వరగా ఛేదించేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్లు మహేందర్, రాంచందర్, రాములును ఎస్సై అభినందించారు.

చీటింగ్ కేసులో నలుగురి రిమాండ్

లింగంపేట: విక్రయించిన భూమిని తిరిగి పొందడానికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పీఎస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అయ్యపల్లి గ్రామానికి చెందిన చల్ల నారాయణ తండ్రి వెంకయ్య తన వ్యవసాయ భూమిని 2002లో అదే గ్రామానికి చెందిన చల్ల నారాయణ తండ్రి హన్మయ్యకు విక్రయించినట్లు తెలిపారు. తక్కువ ధరకు విక్రయించిన భూమిని తిరిగి సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించాడు. తన భూమిని కబ్జా చేసేందుకు తప్పుడు హద్దులతో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించినట్లు బాధితుడు నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో 11 మందిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిలో చల్ల రాజు, చల్ల రాములు, చల్ల మాణిక్యం, చల్ల గంగాధర్‌ను రిమాండ్‌కు తరలించగా మిగిలిన ఏడుగురు పరారిలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.